జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- మునగాలలో గడపగడపకూ మన ప్రభుత్వం

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం కోరుకొండ మండలం మునగాల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ఎస్సీ కాలనీలో గడపగడపకూ తిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగాలలో రూ.ఏడు కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, వాటర్ ట్యాంకులు, రోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించామన్నారు.



మునగాలలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం - కోరుకొండ - భద్రాచలం జాతీయ రహదారిని కలుపుతూ రాష్ట్రీయ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. రాజానగరం నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాలకు చిరునామాగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. అర్హులకు పథకాలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

అందించాలన్న లక్ష్యంతో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్థానికులు తెలియజేసిన పలు సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా వంద గడపలు తిరిగారు. మునగాల గ్రామంలో టీడీపీకి చెందిన పది మంది.. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.

గ్రామ కమిటీల ఏర్పాటు

స్థానిక నర్సాపురంలోని పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు ఫాంహౌస్‌లో మండలంలోని పలు గ్రామాల కమిటీలను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఏర్పాటు చేశారు. బుచ్చెంపేట, దోసకాయలపల్లి, పశ్చిమగానుగూడెం గ్రామాలకు నాయకులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల కన్వీనర్ అడపా కనకరాజు, మునగాల సర్పంచ్ నాగులాపల్లి మణికుమారి, ఎంపీటీసీ సభ్యుడు చింతాకుల లోవరాజు, ఉప సర్పంచ్ తాడిమళ్ల సురేష్, పార్టీ నాయకులు మండపాక కోటేశ్వరరావు, నాగులాపల్లి పెద్ద వెంకన్న, గిద్దా సత్యనారాయణ, మండపాక సీతారాముడు, కొల్లి వీర్రాజు, మండపాక వెంకటపతి పాల్గొన్నారు.

రాపాకలో ఫ్యామిలీ ఫిజీషియన్



పిల్లలకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని రాపాక గ్రామ సచివాలయంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 136 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలు అందించారు. మంచంపై ఉన్న రోగుల ఇంటికి నేరుగా వెళ్లి వైద్యం చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అలాగే అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, ఎస్.లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ చిన్నారి, ఏఎన్ఎం పావని, ఆశవర్కర్లు దేవి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చినకొండేపూడిలో శ్రీవారి ప్రచార రథం

సీతానగరం: శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి సనాతన హిందూధర్మ ప్రచార రథాన్ని శుక్రవారం చినకొండేపూడిలో వాకపల్లి సూరిబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు దర్శించుకున్నారు. వీధుల్లో పసుపునీరు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ నాయకులు సత్తిపండురాజు, ముదునూరి రామకృష్ణంరాజు, పోలినాటి రామచంద్రరావు, పోలినాటి ఈశ్వరరావు, పోలినాటి నరసింహమూర్తి, జగపతి రాజు, ఆకుల త్రిమూర్తులు స్వామికి పూజలు నిర్వహించారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు మెమో

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నంబర్ 94ను శుక్రవారంఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతి రత్నకుమారి తనిఖీ చేశారు. రికార్డు సక్రమంగా లేకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్త శైలజకు మెమో ఇచ్చినట్టు సూపర్‌వైజర్ తెలిపారు.

గోలింగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గోలింగేశ్వరస్వామి ఆలయం వద్ద లక్ష బిల్వార్చన చేశారు. శుక్రవారం ధనుర్మాసం, పౌర్ణమి, శివుడి జన్మనక్షత్రం అయిన ఆరుద్ర కలిసి రావడంతో ఈ ప్రత్యేక పూజలు చేశారు. రామచంద్రపురం నుంచి 15 మంది అర్చకులు స్వామివారి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారి కుంకుమార్చన చేశారు. ఆలయ ఈవో రామలింగభాస్కర్ పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

రాజానగరం: దివాన్‌చెరువులోని వీజేస్ ఫార్మసీ కళాశాలలో మేథో సంపత్తి హక్కులు, పేటెంట్ ఫారమ్‌లు దాఖలు చేసే విధానంపై శుక్రవారం ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్ జరిగింది. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ నేషనల్ డైరెక్టర్ డాక్టర్ టీవీ నారాయణరావు, సదరన్ రీజియన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.వెంకట రమణ, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్‌వీవీ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

రాజానగరం: ఆరోగ్యం, పరిశుభ్రతపై డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తోకాడ పాఠశాలలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌమార దశలో ఉన్న బాలికలలో వచ్చే శారీరక, మానసిక మార్పులు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ హేమమాలిని వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ అనురాధ పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామికి లక్షపత్రి పూజ

పెదపూడి: స్థానిక శ్రీ శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొమ్మనాపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో 10 మంది రుత్విక్కులు పూజలు నిర్వహించారు. స్వామివారి ఆరుద్ర నక్షత్రం, పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దంపతులు పూజల్లో కూర్చున్నారు. అనంతరం భక్తులకు స్వామి వారు ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇచ్చారు.

సారా విక్రేతకు రిమాండ్

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లలో సారా విక్రయిస్తున్న మాగాపు శ్రీనును శుక్రవారం అరెస్టు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. అతడి నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పర్చాగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం యు.గంగాభవాని ఆధ్వర్యంలో 8వ తరగతి చదువుతున్న 45 మందికి వీటిని అందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు చాటపర్తి దుర్గారావు, కొండపల్లి దుర్గారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కర్రి నాగ మల్లేశ్వరి పాల్గొన్నారు.

పారిశుధ్య డ్రైవ్

గోకవరం: గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లు, డ్రైన్లను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, తోలేటి ప్రసాద్ పనులను పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు



భోగిమంట వద్ద వీసీ ఆచార్య జగన్నాథరావు తదితరులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముందస్తు సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. యువతులు గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి, వాటిచుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు భోగిమంటను వెలిగించారు.

రీ-సర్వేతో భూ యజమానులకు మేలు



భూ యజమానికి భూ హక్కు, భూ రక్షా పథకం పత్రాలు అందజేస్తున్న జేసీ తేజ్‌భరత్

అనపర్తి: జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం ద్వారా చేపడుతున్న రీ-సర్వేతో భూ యజమానులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. మండలంలోని రామవరం గ్రామ సచివాలయంలో శుక్రవారం జరిగిన భూ హక్కు, భూ రక్షా పథకం పత్రాల పంపిణీ కార్యక్రమంలో జేసీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూముల సమగ్ర సర్వేను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు. రామవరంలో 692 భూ హక్కు పత్రాలకు గాను ఇప్పటికే 506 పత్రాలు భూ యజమానులకు అందజేశామని, నియోజకవర్గ పరిధిలో మొత్తం 5,641 పత్రాలు పంపిణీ చేయాల్సి ఉందని తెలిపారు. పత్రాల పంపిణీని వేగవంతం చేసి నివేదిక ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామ సచివాలయం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన జేసీ కార్పొరేట్ ఆఫీస్ తరహాలో సచివాలయం ఉందంటూ ప్రజాప్రతినిధులను అభినందించారు. ఆర్డీఓ చైత్రవర్షిణి, తహసీల్దార్ కె.శశిధర్, ఉప సర్పంచ్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి నుంచి ఉపశమనం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


రాజానగరం: క్రీడలతో ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రత్తిపాడు తహసీల్దార్ గోపాల్ అన్నారు. యూనివర్సిటీలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో భాగంగా అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ విభాగ్ సంఘటన కార్యదర్శి సాయి సత్యనారాయణ మాట్లాడుతూ ఏబీవీపీ ద్వారా సమస్యలపై ఉద్యమాలు చేయడమే కాకుండా యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు, నగర కార్యదర్శి గోపి, నగర ఇన్‌చార్జి మనోహర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

రాజానగరం: వ్యవసాయంలో ఖర్చులను తగ్గించి, ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పండించుటకు ప్రకృతి వ్యవసాయం మేలైనదని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మహిళా రైతులకు అవగాహన కలిగిస్తూ మూడు రోజులు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు, కేవీకే ఉద్యాన పంటల అధికారి జేవీఆర్ సత్యవాణి, రాజమహేంద్రవరం క్వాయర్ బోర్డు ప్రాజెక్టు అసిస్టెంట్ శ్రీను రాజీవ్ తదితరులు అవగాహన కలిగించారు. జిల్లాలోని రాజానగరం, రంగంపేట, అనపర్తి, బిక్కవోలు, కడియం, రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం, కోరుకొండ, గోకవరం మండలాలకు చెందిన 80 మంది మహిళా రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే

అనపర్తి: ప్రభుత్వ నిధులతో చేపట్టే పనుల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పాలమూరులో ప్రభుత్వ నిధులతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు పూర్తి పారదర్శకంగా, నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డిలను ఆయన అభినందించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.40



పాలమూరులో సీసీ డ్రైన్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

లక్షలు, పంచాయతీ నిధులు రూ.10 లక్షలు మొత్తం రూ. 50 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

వీరుళ్లమ్మకు హరిద్రాభిషేకం

అనపర్తి: అనపర్తి గ్రామ దేవత శ్రీ వీరుళ్లమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు శుక్రవారం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ భక్తులు సంప్రదాయ బద్ధంగా హరిద్రాభిషేకం నిర్వహించారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు హరిద్రాభిషేకం జరిపారు. ముందుగా గ్రామానికి చెందిన సుమారు 1,000 మంది ముత్తయిదువులు సామూహికంగా స్థానిక ఎర్రకాలువ వద్దకు చేరి బిందెలతో గోదావరి జలాలను తీసుకుని మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు తోడ్కొని వచ్చారు. అనంతరం పసుపు, పుష్పాలు కలిపిన జలాలతో వీరుళ్లమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం గావించారు. ఆలయ అర్చకులు జి.ఈశ్వరశర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్



అమ్మవారి మూలవిరాట్‌కు హరిద్రాభిషేకం చేస్తున్న సత్తి ఆదిలక్ష్మి

సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌కు హరిద్రాభిషేకం చేశారు. ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు ఐదు రోజుల పాటు అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు జరగనున్నాయి. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకవర్గం నియామకం

అనపర్తి: అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా రామవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి నియమితులైనట్లు తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, వైస్ చైర్మన్‌గా రంగంపేట మండలం దొడ్డిగుంటకు చెందిన అడబాల వెంకటేశ్వరరావు, సభ్యులుగా అనపర్తి సర్పంచ్ వారా కుమారి, పెదపూడి మండలం ఏపీత్రయం పీఏసీఎస్ అధ్యక్షుడు గుండా ఈశ్వరరావు, సూరంపూడి సుజాత లక్ష్మి, సిరిగిన రేవతి, పాతి సంధ్య, ఇండుగపల్లి సత్యవతి, సంగడాల పాపయమ్మ, గొర్రిపూడి దాలయ్య, షేక్ ఫీర్ సాహెబ్, సన్నపు సూర్యవతి,



చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి



వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు

దాసరి శరణ్య, అంసూరి సుబ్రహ్మణ్యం, కోనాల వీరవెంకట సత్యనారాయణరెడ్డి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, పోతంశెట్టి విశ్వనాథరెడ్డి, పోతరాజు వరలక్ష్మి, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి, అనపర్తి వ్యవసాయశాఖ సహాయ సంచాలకులను సభ్యులుగా నియమించారు.

అర్హులందరికీ పింఛన్లు

అనపర్తి: కుల, మత, పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతీ ఒక్క లబ్ధిదారునికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెల ఒకటవ తేదీన ఠంచనుగా పింఛను అందజేస్తోందని రామవరం సర్పంచ్ గిరడా గంగాభవాని అన్నారు. సామాజిక పింఛను వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రామవరంలో ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత మొత్తంలో పింఛన్లు అందించడం లేదన్నారు. నవరత్న పథకాల అమలు ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఎంపీటీసీ సభ్యులు గొలుగూరి గౌతమి, నల్లమిల్లి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సీతానగరం: చినకొండేపూడిలో పింఛన్ల పంపిణీ చురుగ్గా సాగుతోంది. సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ సత్తిపండు రాజు, పార్టీ నాయకుడు ముదునూరి రామకృష్ణంరాజు తదితరులు పింఛన్‌దారులకు నగదు అందజేశారు. గ్రామంలో 1,250 మంది లబ్ధిదారులున్నారని, ఇప్పటికే 99 శాతం అందించామని సర్పంచ్ శ్రీనివాస్ తెలిపారు.


రంగంపేట: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో నూతన వైఎస్సార్ పింఛను కానుక స్థానిక గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్ ముంగి గంగరాజు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గంగరాజు మాట్లాడుతూ గ్రామంలో 20 మందికి నూతన పింఛన్లు రూ.2,750 చొప్పున అందించామన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ మాగాపు వెంకట రమణ, ఉప సర్పంచ్ అంచూరి శ్రీను, నాయకులు విజయబాబు, అంచూరి చిన నాగేశ్వరరావు, బోడెం సూరిబాబు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

గోకవరం: స్థానిక ఎంఆర్‌సీలో శుక్రవారం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎన్నికల అధికారి ఎండీ షరీఫ్, పర్యవేక్షణ అధికారి ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక జరిగింది. సంఘ మండలాధ్యక్షుడిగా ఎస్.అనిల్ కుమార్, గౌరవాధ్యక్షుడిగా కె.నాగభూషణం, సహాధ్యక్షులుగా ఎస్.కుమార్, పీఎస్‌వీఆర్ఎల్ నరస, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాస్, కోశాధికారిగా పీవీవీఎస్ఆర్ త్రిమూర్తులు, ఆడిటర్‌గా ఎం.రత్నంతో పాటు 10 మంది కార్యదర్శులుగా ఎన్నికయ్యారు.

మహిళ అదృశ్యం

గోకవరం: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీస్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గోకవరానికి చెందిన గోలి రంగయ్య భార్య గోలి గొంతెమ్మ ఆరు నెలలుగా మతిస్థిమితం కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతోంది. గురువారం రాత్రి తొమ్మిది గంటలకు తన నివాసంలో పడుకున్న గొంతెమ్మ తెల్లవారేసరికి కనబడలేదు. పరిసర ప్రాంతాలు, కుటుంబ సభ్యుల ఇళ్లలో గాలించినా ఆచూకీ దొరకకపోవడంతో గొంతెమ్మ భర్త రంగయ్య పోలీసుకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. గొంతెమ్మ వయసు 58 సంవత్సరాలు, ఎత్తు 4 అడుగులు, లేత నీలం కలర్ నైటీ ధరించింది. ఆమె ఆచూకీ తెలిసిన వారు 98482 92845, 08832 455533, 94409 04830 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.



గొంతెమ్మ (ఫైల్)